క్లుప్తంగా

దాసాంజనేయునికి విశేష పూజలు


లక్ష తమలపాకుల అలంకరణలో దాసాంజనేయ స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీహనుమద్ జయంతి వార్షిక మహోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీమారుతి టాకీస్ సెంటర్‌లోని శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారికి లక్ష తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈవో గొట్టుముక్కల నాగ సీతారామరాజు పర్యవేక్షణలో అర్చకులు ఘంటసాల భాస్కర శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం 1300 అరటిపళ్లు, లక్ష తమలపాకులతో స్వామి వారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గొబ్బిళ్ల సంబరాలు


గొబ్బిళ్ల సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసం సందర్భంగా గునుపూడి బంగ్రోతు వారి వీధిలోని శ్రీకృష్ణ భగవాన్ స్వామి ఆలయంలో గొబ్బిళ్ల సంబరాలను నిర్వహించారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో పండుగలు ప్రధాన భాగమని, పండుగ విశిష్టతను నేటి చిన్నారులకు తెలియజేయాలనే ప్రతివారం శ్రీకృష్ణ భగవాన్ స్వామి ఆలయంలో గొబ్బిళ్ల సంబరాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. చిన్నారులు కామిరెడ్డి హర్షినీ దేవి, యలకల మేఘన, మధిర అమృత వల్లి, అమ్మటి నాగ మునీశ్వరి, జై నాగ సాయిచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ గొబ్బిళ్ల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అరసవల్లి ఈశ్వరమ్మ వీరవెంకట ఆచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం సౌజన్యంతో చిన్నారులకు చిరు కానుకలు అందజేశారు.

ఎస్సైగా ఎంపికైన కానిస్టేబుల్


ఎస్సై పోస్టుకు ఎంపికైన కొవ్వాడ గణేష్ వర్మ

ఆకివీడు: ఏలూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొవ్వాడ గణేష్ వర్మ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యాడు. ఆకివీడు చెందిన గణేష్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. 2018లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన అతడు ఇటీవల జరిగిన పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎస్సైగా ఎంపికయ్యాడు. తాను ఉన్నత చదువులు చదివేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతగానో ఉపయోగపడిందని గణేష్ ఈ సందర్భంగా తెలిపాడు.

చురుగ్గా పూడికతీత పనులు

నరసాపురం: పట్టణంలోని కుణాయిచెరువు వెనుక ఉన్న డ్రెయినేజీ పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. ఈ డ్రెయినేజీ అవుట్‌లెట్ పూడుకుపోవడం వల్ల నీరు పారడంలేదు. వర్షం వచ్చినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. డ్రెయిన్ ద్వారా వర్షపు నీరు, మురుగునీరు కలిసి రోడ్లపైకి వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు స్పందించి పూడికతీత పనులు మొదలు పెట్టారు. రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని కమిషనర్ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకోడేరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి మండలం లక్ష్మీనారాయణ పురం శివారు దంపబోయినవారిపాలేనికి చెందిన పుప్పాల వీర వెంకటశివ సత్యనారాయణ(20) నారాయణపురం లిక్కర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఐదు రోజుల క్రితం సొంత ఊరు దంపబోయినవారిపాలెం వచ్చాడు. ఈనెల 21వ తేదీన పని మీద పాలకోడేరు మండలం మోగల్లు మోటార్ సైకిల్‌పై వచ్చాడు. అదేరోజు రాత్రి తిరిగి ఊరుకు వెళుతుండగా లక్ష్మీనారాయణ పురం రోడ్డులో వరి గడ్డిమోపు ని ఢీకొని బైకు అదుపుతప్పి రోడ్డుపై పడడంతో గాయాలపాలయ్యాడు. దీంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆ తరువాత విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈమేరకు ఆసుపత్రి నుంచి సమాచారం అందిందని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. అనంతరం మృతుడికి పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. మృతుడు శివ సత్యనారాయణ తండ్రి ప్రకాశం ఇదే రహదారిలో మోటార్ బైక్ ప్రమాదంలో చనిపోయాడు. తల్లి ప్రభావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు తెలిపారు. ప్రభావతికి ఇద్దరు కుమారులు కాగా శివ సత్యనారాయణ పెద్ద కుమారుడు.

వాడవాడలా క్రిస్మస్ వేడుకలు


భీమవరం (ప్రకాశం చౌక్): సెయింట్ మేరీస్ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


భీమవరం అర్బన్: దొంగపిండిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దృశ్యం


పాలకోడేరు: మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవ సోదరులు


ఉండి: మహదేవపట్నంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భీమవరం (ప్రకాశంచౌక్): క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. భీమవరం 18 వ వార్డు రెల్లి కాలనీ ఎదురుగా రైల్వే జంక్షన్ రోడల్లోని బేతేలు చర్చ్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎంఆర్‌ఓ కృష్ణాజి దంపతులు, భీమవరం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంటుమిల్లి కృష్ణ, కనకరాజు, నారాయణపరపు నరసింహారావు, లత హాజరయ్యారు. క్రిస్మస్ కేక్‌ని కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మంకు సరోజిని అనే మహిళకు కోడే వీరమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కుట్టుమెషీన్ అందజేశారు. ఈ సందర్భంగా కోడె యుగంధర్ మాట్లాడుతూ ఉన్నంతలో ఎదుటివానికి సహాయం చేయడంలోనే దైవత్వం ఇమిడి ఉందని, ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని కోరారు. బేతెలు చర్చ్ పాస్టర్ కృపావరం మాట్లాడుతూ తోటివారిని ప్రేమించాలని, నిరుపేదలను అభాగ్యులను ఆదుకోవాలని బైబిల్ బోధిస్తుందన్నారు. అనంతరం మహిళలకు బేతెలు చర్చ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. క్రిస్మస్ తాత చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. దైవజనుల చేతుల మీదుగా 2024 నూతన సంవత్సర క్యాలెండర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల క్రిస్మస్ గేయాలు, ప్రార్థనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బేతెలు చర్చ్‌లో రామ విందును అందించారు. కార్యక్రమంలో ఎస్ పండు, ఎస్. దేవయాని, చర్చ్ సిబ్బంది పాల్గొన్నారు

సెయింట్ మేరీస్ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలు

సెయింట్ మేరీస్ ఆసుపత్రి ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సిస్టర్స్ అధ్వర్యంలో సంఘ సేవకులు ఎస్‌కే చాన్ భాషాను సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి సుపీరియర్ సిస్టర్ మేరీ మాట్లాడుతూ ప్రతి మతంలోని సారాంశం ఇతరులకు సహాయ పడటమేనని అన్నారు. ఆసుపత్రి సీనియర్ జోగ్ మోరి, సిస్టర్లు లిస్నా, లిస్సీ, ఎల్విరా, యాని, అర్మడా దైవ ప్రార్థనలు నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదవారికి స్వీట్లు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

ఉండి: ఏసుక్రీస్తుని జననం సర్వపాప నివారణం అని ఎన్నార్పీ అగ్రహారం ప్యారిష్ పాస్టర్ వీ నెహ్రూ అన్నారు. సోమవారం ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది క్రైస్తవులు చర్చిలకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహదేవపట్నంలో వీ నెహ్రూ, ఎన్నార్పీ అగ్రహారంలో ఎం మార్కురాజు ప్రార్థనలు చేశారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో సీఆర్ ఎం రాజశేఖర్, ఆల్టర్‌నేట్ డెలిగేట్ మంగం రవికుమార్, పీసీసీ మూరా శామ్యేల్, పాలమూరి ప్రభుదాసు, క్యాషియర్ నరేడ్ల జ్ఞానకుమార్, ముళ్లగిరి కాంతారావు, సంఘ పెద్దలు యాళ్ళ భాస్కరరావు, కోలాటి దావీదురాజు, అద్దంకి యాకోబు, సోడగిరి బాలసుందరం, సంధి ప్రదీప్, బోడిగడ్డ సునీల్‌కుమార్, బర్రే ఏసేబు, మాతా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పాలకోడేరు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్ రాజు ప్రబోధించారు. పాలకోడేరు మండలంలో సోమవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. చర్చి లలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు జరిపారు. క్రీస్తు జనన నాటికలు ఎంతగానో అలరించాయి. శృంగవృక్షం లోని సుందరయ్య కాలనీ చర్చిలో క్రైస్తవ సోదరులు మాజీ సర్పంచ్ బూరాబత్తుల సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉండి పూర్వపు ఎస్సై బలే జోసఫ్ రాజు, బలే పెద్దులు, కోనలపల్లి నాని, చిగురుపాటి మాణిక్యాలరావు, సంఘ పెద్దలు చిల్లా రత్నరాజు, గోడి భూషణం, మైలాబత్తుల వెంకటరావు, కేదాసి చిట్టిబాబు, గుర్రం డేవిడ్, విశ్వాసులు, సండే స్కూల్ విద్యార్థులు, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు ప్రభువు

భీమవరం అర్బన్: లోకాన్ని రక్షించేందుకు భూమిపై ఏసు క్రీస్తు ప్రభువు వచ్చాడని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలంలోని పెదగరువు గ్రామ పంచాయతీలోని చినగరువులో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమన్నారు. అనంతరం క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక గీతాలపనలు ఆలపించారు. దొంగపిండిలో క్రీస్తు ఏసు ప్రార్థన సహవాస మందిరంలో పాస్టర్ రేవు శాంతరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి అందరికి పంచి పెట్టారు. సంఘ పెద్దలు బొడ్డు ఇస్సాకు, మోషే, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, వెంప, తుందుర్రు, కొత్తపూసలమర్రు, చినఅమిరం తదితర గ్రామాలలో చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి కేక్‌లను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు భూమిపై క్రీస్తు రాకడ గురించి, క్రైస్తవ్యాన్ని గురించి వివరించారు. చర్చిలలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు గీతాలాపనలు చేశారు.

ఘనంగా క్రిస్మస్ పండుగ

ఆకివీడు: శాంతి, ప్రేమ, దయార్ద హృదయంతో ప్రజలు మెలిగే విధంగా ఏసుప్రభు ఈ లోకానికి రక్షకుడుగా జన్మించారని ఆంధ్ర బాప్టిస్టు సెంచనరీ టౌన్‌చర్చి ప్రతినిధి, స్టేట్ సీబీసీఎన్‌సీ కార్యదర్శి డాక్టర్ గూడపాటి జోసఫ్ రాజు చెప్పారు. స్థానిక పెదపేటలోని చర్చి ఆవరణలో ఆదివారం క్రిస్మస్ కేకును ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, జోసఫ్‌రాజు కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం పెరగాలన్నారు. అందరూ కలిసి మెలిసి ఉండే విధంగా క్రీస్తు బోధనలు న్నాయన్నారు. ఏఎంసీ చైర్మన్ రసూల్‌బీబీ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రజలకు మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలోమాజీ ఉప సర్పంచ్ ఎస్కే. హుస్సేన్, స్త్రీల సమాజం, యువజన సంఘం, పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. స్థానిక సీబీసీఎన్‌సీ ప్రధాన చర్చి, హోప్ బాప్టిస్టు చర్చి, కల్వరీ బాప్టిస్టు చర్చి, పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రిస్మస్‌కేకును కట్‌చేశారు.

వీరవాసరం: ప్రేమ, శాంతి, సహనం, సమాధానం కలిగి ఉండడమే నిజమైన ఏసు మార్గమని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు) తెలిపారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడారు ముందుగా ఏసు కొరకు ప్రత్యేక గీతాలాపనలు, ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాస్టర్ కర్పలా రత్నరాజు, సర్పంచ్ చికిలే మంగతాయారు, నేతల జ్ఞాన సుందరరాజు, కడలి ధర్మారావు, గూడూరి ఓంకార్, కాటం స్టాన్లీ రాజు, నూకల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల: మండలంలోని అన్నిగ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ సందర్భంగా చర్చిలను ఆకర్షణీయంగా అలంకరించారు. క్రిస్మస్ గీతాల ఆలాపన, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆటపాటలతో చర్చ్‌లు సందడిగా నెలకొన్నాయి. ఏలూరుపాడు, కాళ్ల, పెదఅమీరం, జక్కరం, బొండాడ, కోపల్లె, జువ్వలపాలెం, కలవపూడి, కాళ్లకూరు, దొడ్డనపూడి, కోలనపల్లి, వేంపాడు, ప్రాతాళ్ళమెరక, సీసలి, తదితర గ్రామాల్లో ఏసుప్రభువు పుట్టుక వివరించే చిత్రపటాలు, క్రిస్మస్ స్టార్లు, శిలువ మోయడం, గొర్రెల కాపరిగా ఇలా రకరకాల దృశ్యాలను ఆకర్షణీయంగా తయారుచేసి చర్చి ఆవరణల్లో ప్రదర్శించారు.

బేతని చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు


భీమవరం: బేతని చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలకు హాజరైన విశ్వాసులు

భీమవరం: పట్టణంలోని బేతనిచర్చ్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చ్ పాస్టర్ ఎస్ పుష్పరాజ్ మాట్లాడుతూ క్రీస్తుబోధనలు ప్రపంచమానవాళికి శాంతిని కలుగచేస్తాయన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టా దేవరాజ్, గంటా సుందరకుమార్, కె చోటాప్రకాష్, డి డేవిడ్ రాజు, కె ఇమ్మానుయేల్, ఏఎస్‌ఆర్ శాస్త్రి, జి పరమానందం తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడు: పెదపేటలోని ఆంధ్ర బాప్టిస్టు సెంచనరీ టౌన్ చర్చిలో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న దృశ్యం


భీమవరం (ప్రకాశం చౌక్): బేతేలు చర్చ్‌లో కుట్టు మెషీన్ అందజేస్తున్న దృశ్యం


వీరవాసరం: క్రిస్మస్ వేడుకల్లో ప్రార్థనల అనంతరం కేక్ కట్ చేస్తున్న దృశ్యం


కాళ్ల: ఏలూరుపాడు చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు


భీమవరంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో పలు శక్తి కేంద్రాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజవర్గ కన్వీనర్ కాయిత సురేంద్ర మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప విలక్షణమైన వ్యక్తిత్వం గల వాజ్‌పేయి ప్రధానిగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, వబిలిశెట్టి ప్రసాదరావు, షేక్ మొహిద్దీన్, అరసవల్లి మణికంఠ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి

వీరవాసరం: దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని మండల కేంద్రంలోని లిటిల్ బర్డ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కోశాధికారి కురెళ్ల నరసింహారావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఆకుల లీలా కృష్ణ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వాజ్‌పేయి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని వాజపేయికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

కష్టపడి పనిచేసేవారికి సముచిత గుర్తింపు

ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు


నామన మహేష్‌కు సోమేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఏడుకొండలు, కోడే యుగంధర్

భీమవరం అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించి గౌరవిస్తుందని ఏఎంసీ మాజీ చైర్మన్, ఆ పార్టీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ అన్నారు. తాడేరు గ్రామంలో ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన నామన మహేష్‌ను సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమాని ఏడుకొండలు, కోడే యుగంధర్ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడితే అధిష్టానం గుర్తిస్తుందన్నారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి సమష్టిగా 2024లో రాష్ట్రంలో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, గ్రంధి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. అభినందనలు తెలిపిన వారిలో మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, గాదిరాజు రామరాజు, మట్టా యేసు, బొచ్చా ధర్మ, కొట్టు సతీష్, నామన సూర్య భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మోగల్లులో నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు


కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారులు

పాలకోడేరు: మోగల్లులో విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో సోమవారం కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. ఆదివారం ఇన్నోవా కారు ఢీ కొట్టిన ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి ఆ స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ఆర్‌వీ అప్పారావు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

జూదరుల అరెస్ట్

భీమవరం: పేకాట కేసులో అయిదుగుర్ని అరెస్టు చేసినట్లు భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ సోమవారం చెప్పారు. రాయలం గ్రామంలోని శ్మశానవాటికకు సమీపంలో పేకాడుతున్న అయిదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,070 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సీఎం జగన్ జనరంజక పాలన


పెదమల్లంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

పెనుగొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని పెదమల్లం సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఆచంట మండలం పెదమల్లంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ప్రజల జీవితాలు బాగుండాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాల్సిన ఆవశ్యకతను ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేసి పేదలకు మేలు చేసిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ప్రభుత్వం పథకాలను ఆపకుండా కొనసాగించిందని అన్నారు. మంచి మనసున్న సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరక్టరు కొండేటి భవనీ ప్రసాద్, పంచాయతీ సభ్యులు మాత వినయ్, నక్క శ్రీను, సచివాలయ కన్వీనర్లు కంపాటి చంటి, బోడపాటి సత్యనారాయణ(పండు), వైఎస్సార్ సీపీ నాయకులు రాజమహేంద్రవరపు శివ, గోకరమండల మన్న కుమార్, దిరిశాల సత్యనారాయణ, తాడి మాచిరాజు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి


ఆచంటలో కమ్యూనిటీ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నియోజకవర్గంలో పలు సంఘాలకు కేటాయించిన భవన నిర్మాణాలను సత్వరం ప్రారంభించి పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. సోమవారం ఆచంటలో కమ్యూనిటీ భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆచంటలో 11 సంఘాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మాణాలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీటి నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభించారన్నారు. త్వరగా పూర్తి చేసి ఆయా సంఘాలకు అప్పగించాలన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ఇతర నిధులతో గ్రామాల్లో రహదారుల, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. గడపగడపకు నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధి పనులన్నీ వేతవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ కుక్కల కిరణ్‌కుమార్, పి వనమరాజు, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు ప్రారంభం

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 8 గంటలకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉండి పెద్దవంతెన సెంటర్ వద్ద నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వీరవాసరం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు పంచాయతీ స్థాయిలో ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని ఎంపీడీఓ జ్యోతి సోమవారం తెలిపారు. అండలూరు, తోలేరు, కొణితివాడ, రాయకుదురు, వీరవాసరం, మత్స్యపురి గ్రామాల్లో మొత్తం 5 విభాగాలలో (ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ) పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రజాప్రతినిధులతోపాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శక్తీశ్వరాలయానికి రూ.2.50 లక్షల విరాళం


విరాళం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న దాత నరసింహరాజు

ద్వారకాతిరుమల: దక్షిణ కాశీగా విరాజిల్లుతోన్న భీమవరం మండలం యనమదుర్రులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శక్తీశ్వర స్వామివారి ఆలయానికి, మండలంలోని రామసింగవరం పంచాయతీ, కొత్తగూడెంకు చెందిన పెన్మెత్స నరసింహరాజు, రాజరాజేశ్వరి దంపతులు రూ.2.50 లక్షలను విరాళంగా సోమవారం అందజేశారు. ఈ విరాళాన్ని నరసింహరాజు తన తల్లిదండ్రులు శక్తీశ్వరరాజు, వరలక్ష్మి పేరున ఆలయ అభివృద్ధి నిమిత్తం దేవస్థానం కమిటీకి అందించినట్లు చెప్పారు. అనంతరం నరసింహరాజు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి అభినందనలు తెలిపారు.